1

# అమ్మ మనసు

పార్వతికి నొప్పులు ప్రారంభం అయినాయి. భర్త సోమశేఖరానికి చెప్పింది. అతను మరో క్షణంలో ప్రపంచం నాశనం అయిపోతున్నంత ఇదిగా కంగారుపడ్డాడు. ఒక్క అంగలో బయటికి గెంతి పక్కింటి జానకమ్మగారితో చెప్పి ఆవిడ ముందు దీనంగా నిలుచున్నాడు.

ఆవిడ - "నువ్వేమీ భయపడకయ్యా, నేనున్నానుగా?" అన్నది చిరునవ్వు నవ్వుతూ.

సోమశేఖరంతో బాటు అతని ఇంటికి వెళ్ళి ఒకసారి పార్వతి పరిస్థితి ఎలా ఉందో చూసి, మంత్రసానిని తీసుకు రావడంకోసం బయటికి వెళ్ళింది జానకమ్మ.

సోమశేఖరానికి మాత్రం దిగులు దిగులుగా, భయం భయంగా ఉంది. అతని మొదటి భార్య మొదటి కాన్పులోనే మరణించింది. బిడ్డకూడా దక్కలేదు. పార్వతి సోమశేఖరానికి రెండవ భార్య. పార్వతంటే సోమశేఖరానికి ప్రాణం. అతను తన జీవితంలో పార్వతిని ప్రేమించినంత మిన్నగా మరి దేన్నీ ప్రేమించలేదని చెప్పవచ్చు. పార్వతి అంత ఉన్నతమైన వ్యక్తిత్వం గల మనిషి అతనికి తటస్థపడలేదుకూడా.

తన మొదటిభార్య కాన్పులో మరణించడం, ఇప్పుడు పార్వతి అదే స్థితిలో ఉండడం - అంతేకాక, మొదటి కాన్పు

ఆడదానికి పునర్జన్మతో సమానమని ఎవరో అనగా విన్న మాటలూ గుర్తుకువచ్చి సోమశేఖరం మరింత భయపడుతున్నాడు.

భర్తకు ఉత్తమురాలైన భార్యకన్నా విలువైంది ఈ ప్రపంచంలో మరొకటి ఉండదు. అంతటి విలువైనదానిని కోల్పోవడమన్న విషయం ఊహాలలోనైనా ఎవరైనా సహించగలరా?

"ఏమిటండీ మీరు మరీ చంటిపిల్లవాడిలా? నా కేమీ కాదని చెపుతున్నానుగా? మిమ్మల్ని వదిలి నేను స్వర్గానికైనా పోను. ప్రపంచంలోని ఏశక్తి మనల్ని విడదీయలేదండీ. మీరు ఊరికే లేనిపోని భయాలు పెట్టుకోకండి" అంటూ భర్తకి ధైర్యం చెప్పింది పార్వతి తన నొప్పులను సహిస్తూ.

కాస్సేపటికి జానకమ్మ మంత్రసానిని వెంటబెట్టుకని వచ్చింది వాళ్ళు సోమశేఖరాన్ని గది బయటకు పంపించేసి తలుపులు వేసుకున్నారు.

పార్వతికి నొప్పులు క్రమంగా ఎక్కువ కాసాగాయి. జానకమ్మ, మంత్రసాని పార్వతికి ధైర్యం చెపుతున్నారు. కాని, వారి మాటలేమీ పార్వతి తలకెక్కడంలేదు. వాళ్ళు దేన్నిగురించి తనకు ధైర్యం చెపుతున్నారో దాని గురించి పార్వతికి అసలు భయమే లేదు. అంతమాత్రంచేత ఆమె మనసులో భయం లేదనికాదు. ఆమె మనసులోని భయం కాన్పు గడవడం గురించి కాదు. ఆమె భయమంతా తనకు పుట్టబోయే బిడ్డగురించే.

ఒకవేళ తనకు పుట్టిన బిడ్డ నల్లగా, తుమ్మమొద్దులా, అసహ్యంగా, అనాకారిగా ఉంటే?

ఛ! ఛ! అలా జరగడానికి వీల్లేదు!

వీల్లేదని అనుకుంటే మాత్రం? అదేమైనా తనచేతుల్లో ఉందా?

తనకు అందమైన బిడ్డ ఎందుకు పుట్టకూడదూ?

"ఎందుకు పుట్టాలి?" అన్న ప్రశ్న ఉదయించింది.

కాదు. అలా జరగడానికి వీల్లేదు. తనకు అనాకారి అయిన బిడ్డ కలగకూడదు. ఒకవేళ అనాకారే గనక పుడితే తను ఎన్ని బాధలు పడ్డదో తన బిడ్డకూడా అన్ని బాధలూ పడవలసి వస్తుంది.

తనకైతే అనుకోని విధంగా దేవుడులాంటి భర్త లభించాడు. తన బిడ్డను ఆదరించేవాళ్ళు దొరుకుతారని నమ్మకం ఏముంది?

కాదు. అలా కాకూడదు. తనకు అనాకారి పుట్టనే కూడదు. ఒకవేళ పుట్టిందంటే తను ఆ బిడ్డ తనలా బాధలు పడకుండా పురిటిలోనే గొంతుపిసికి చంపేసి తను కూడా ఏ మందోమాకో తినేసి ప్రాణం తీసుకోవాలని అనుకుంది పార్వతి.

తను ఎంత మానసిక క్షోభను అనుభవించింది!!

తన బిడ్డ అన్ని బాధలు భరించగలదా? పగవాడికి కూడా అంతటి మానసిక క్షోభ కలగకూడదు. అంతటి

అశాంతికి తన బిడ్డను ఎలా గురిచేయగలదు? అందుచేత, పురిటి లోనే గొంతు పిసికి...

"అమ్మా!" అంటూ బాధగా మూలిగింది పార్వతి.

"ఏం భయం లేదు. మేమున్నాముగా?" అంది జానకమ్మ.

'అవును... పురిటిలోనే గొంతు పిసికి' మళ్ళీ అనుకుంది పార్వతి.

ఆమె మనసు గతం అనబడే పుండును కెలికింది.

* * * *

వీరభద్రరావుగారు ఒక ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా పనిచేస్తున్నారు. సరస్వతమ్మగారు ఆయనకు అనుకూలవతి అయిన భార్య. వారికి సంతానం నలుగురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలు. అందరికంటే పార్వతే పెద్దది. పార్వతి తరువాత ఒక అమ్మాయి, తరువాత ఇద్దరు అబ్బాయిలు, వాళ్ల తరవాత ఇద్దరమ్మాయిలూ, ఒకబ్బాయీనూ! గంపెడు సంసారంతో చాలీచాలని జీతంతో వీరభద్రరావుగారు గుట్టుగా సంసారాన్ని లాక్కొస్తున్నారు.

ఆ ఇంటిలో పిల్లలందరిలోకి సుమిత్ర చాలా అందంగా ఉంటుంది. సుమిత్రంటే పార్వతి తరువాతి అమ్మాయి. తను అందంగా ఉంటానన్న గర్వంకూడా ఆ అమ్మాయికి జాస్తి. పార్వతి అందరికి అనాకారి. ఆమె బహు కురూపి. పార్వతి నల్లగా తుమ్మమొద్దులా ఉంటుంది. నల్లగా ఉన్నా కనీసం

శరీరంలో మెరుపన్నా లేదు. పార్వతి నవ్వితే పళ్ళపై చిగుళ్ళు ఎర్రగా కనిపిస్తూ అసహ్యంగా ఉంటుంది. ఆ పళ్ళయినా ఎత్తుగా ఉంటాయి అందుచేత ఆ ఇంటిలో అందరికీ పార్వతంటే చులకన. కాని, గుణాల్లో పార్వతిని మించగలవారెవ్వరూ లేరు. ఆమె అతి నెమ్మదైన మనిషి చాలా ఓర్పు ఉంది ఆమెలో. అందుచేతనే వీరభద్రరావుగారికి పార్వతంటే అమితమైన ఇష్టం.

చిన్నప్పటినుండీ పార్వతి ఎవరితోనూ ఎక్కువగా కలిసేది కాదు. బడిలో కూడా పిల్లలతో ఏమంత మాట్లాడేది కాదు. సాయంకాలం పిల్లలందరూ ఆడుకుంటుంటే వరండాలో కూర్చుని చూసేది. తనకుకూడా వాళ్ళందరిలా సరదాగా మాట్లాడాలనీ, వాళ్ళతో కలిసి ఆడాలనీ, పాడాలనీ, ఎన్నో కోరికలు ఉండేవి కాని, ఆమెరూప విహీనత అందుకు ప్రతిబంధకమైంది. ఏనాడైనా మనసు చంపుకోలేక పిల్లలతో కలిసి ఆడితే ఆ రోజు ఏడుపు తప్పదు.

పిల్లలందరూ ఆడే ఆటను మానివేసి పార్వతిని మారుపేర్లు పెట్టి పిలిచి ఏడిపిస్తూ వినోదించేవారు.

"ఏయ్ కోతీ... నన్ను ముట్టుకోవోచ్!"

"ఏయ్ దయ్యం... ఇలా రావే..."

"ఏయ్ తారుడబ్బా ... నిన్నే"

"ఒసేవ్ ఎత్తుపళ్ళూ... రేపుబడికి వస్తున్నావా, లేదా?"

ఇలా ఉండేవి వాళ్ళ మాటలు. అయినా, పార్వతి

ఏమీ అనేది కాదు. ఆమెలో ఆ సహనం చిన్నప్పటినుండి ఉంది. బాధ కలిగితే తనలోతనే కుమిలిపోయేది.

ఇది వాళ్ళకు మరింత అలుసైంది. పిల్లలలో ఎవరో ఒకరు పార్వతి కళ్ళు మూసేవారు. మిగతా పిల్లలందరూ మెట్టికాయలు వేసి పారిపోయేవారు. పార్వతి ఇంటికి వెళ్ళి ఒకమూల కూర్చుని నిశ్శబ్దంగా ఏడ్చేది. సరస్వతమ్మగారు చూసి, ఏమైందని అడిగితేతప్ప ఏ విషయమూ చెప్పేది కాదు.

"నీకేమే...నువ్వుబంగారు కొండవి! వాళ్ళే కోతులూ, కొండముచ్చులూను. ఎవరే నిన్ను తారుడబ్బా అని అన్నది? నీ మొహంలో ఉన్నకళ ఆకోతిలో ఉందా? నువ్వు రోజూ దణ్ణంపెట్టే ఆ కృష్ణుడూ, రాముడూ నీకంటే నల్లనివాళ్ళే. పిచ్చితల్లీ! ఊరుకో, అమ్మా, ఊరుకో" అంటూ ఒడిలో కూర్చోబెట్టుకొని పార్వతిని ఊరడించేది.

పార్వతి స్కూలుఫైనలు వరకూ ఆ అల్లరి పిల్లలమధ్య ఎలానో సరిపుచ్చుకుంటూ వచ్చింది. కాని, కాలేజీలో విద్యార్థినీ విద్యార్థుల అల్లరిమాత్రం భరించలేకపోయింది. వారిది మరోవిధమైన అల్లరి!

తోటి విద్యార్థినులు పార్వతిని రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ-ఇలా ఎవరికి ఇష్టమైన పేర్లతో వాళ్ళు పిలుస్తూండే వారు. కొందరు విద్యార్థులు "పార్వతీ! నీ రూపాన్ని ఏమని వర్ణించను? నిన్నుచూసి మతి పోగొట్టుకున్నాను, బ్రతకలేను. నీ సౌందర్యం... చందమామ... కలువపూలు... నాబ్రతుకు వృథా..." అంటూ పార్వతికి ఉత్తరాలు వ్రాసి సంబర పడేవారు.

సహనానికి కూడా ఒక హద్దంటూ ఉంటుంది. పార్వతి కాలేజీ చదువు మధ్యలోనే ఆపివేసింది.

పోనీ, బయటివాళ్ళు కాబట్టి అలా ప్రవర్తించారని అనుకున్నా, ఇంటిలో కూడా పార్వతికి ఈ బాధ తప్పలేదు.

పార్వతి తమ్ముళ్ళు, చెల్లెళ్ళు తనని 'కోతీ, కొండ ముచ్చా' అంటూ సంభోధించేవారు. వాళ్ళు వీరభద్రరావు గారు ఇంటిలో ఉన్నప్పుడు మాత్రం 'అక్కయ్యా' అని వారు. పార్వతికి ఏమాత్రం కష్టం కలిగినా వీరభద్రరావు సహించేవారు కారు. వీరభద్రరావుగారు ఇంటిలో లేనప్పుడు మాత్రం చిన్న తమ్ముడు దగ్గరినుండి సుమిత్రవరకూ పార్వతి మీద పెత్తనం చెలాయించేవారు.

ఒకసారి పార్వతి అద్దం ముందు కూర్చుని తయారవుతుంటే సుమిత్ర రయ్యిమని వచ్చింది.

"ఇంక చాల్లే. ఎంతసేపని టాయిలెట్ అవుతావు? ఎలక తోకని ఎంత ఉతికినా, నలుపు నలుపేగాని తెలుపు కాదు కదా! ఎంత తయారయితేమాత్రం రూపం ఎక్కడికి పోతుంది? త్వరగా అద్దంతే. నేను టాయిలెట్ అయి కాలేజీలోని ఫంక్షనుకు అటెండ్ అవ్వాలి?'' అంది.

ఇటువంటి సంఘటనలు ఒకటి రెండు జరిగాక పార్వతి అలంకరణమీద ఉన్న ఆ కొద్ది శ్రద్ధ కూడా తగ్గించేసింది. కాని, పార్వతికి నిజంగా జీవితంమీద విరక్తి అనేది ఆమెకు పెళ్ళి సంబంధాలు వస్తున్నప్పటి నుండి మొదలయింది.

పార్వతిని చూడవచ్చిన ప్రతి ఒక్కరూ సుమిత్రని చేసుకుంటామని అడిగేవారు. ప్రతి సంబంధం అలానే వెనక్కు పోయేది.

ఒకరిద్దరు పార్వతిని చేసుకోవడానికి సిద్ధపడ్డారు. అయితే, వాళ్ళు కట్నం వీళ్ళు ఇవ్వగలిగిన దానికి దాదాపు రెట్టింపు అడగడంవల్ల ఆ సంబంధాలు కూడా తప్పిపోయాయి. వాళ్ళు డబ్బుమనుషులు వాళ్ళడిగినంత కట్నం ఇచ్చి ఏ మెడలో తాళి కట్టమన్నా కట్టేస్తారు కొందరు డబ్బు విలువ ఆడబ్బును సృష్టించిన మనిషికి ఇవ్వరు. అటువంటి వారి జీవితంలో అమృతతుల్యమైన ప్రేమకు తావులేదు గాజు పూసను వజ్రంగా భ్రమసినట్లు, డబ్బుతో పొందే అనుభవాన్ని వారు నిజమైన ఆనందంగా భ్రమపడతారు

వీరభద్రరావుగారు సంబంధాలకోసం పిచ్చికుక్కలా తిరిగారు. కాని, ఫలితం శూన్యం. ఎన్నడూ లేనిది సరస్వతమ్మ గారు కూడా పార్వతిని విసుక్కోవడం మొదలు పెట్టారు. ఆఖరికి కన్నతల్లి కూడా తనను విసుక్కోవడంతో పార్వతి కృంగిపోయింది. తను ఆత్మహత్య చేసుకుంటే ఎవ్వరికీ ఏ సమస్యా ఉండదని ఆమె అనుకున్నది కూడా.

ఒకనాడు ఊరునుండి పార్వతి మేనమామ వచ్చాడు. అతను పార్వతి సంగతి విని చాలా విచారించి తన ఎరికలో ఒక మంచి సంబంధం ఉందనీ, కుర్రవాడు తనకు బాగా పరిచయం ఉన్నాడనీ, తనమాట కాదనడనీ మంచి బుద్ధిమంతుడనీ చెప్పాడు. వీరభద్రరావుగారికీ ఇష్టమయితే మాట్లాడతానని

అన్నాడు. ఇంకా, కుర్రవాడు రెండవ పెళ్ళివాడనీ, ఆమధ్యనే అతని పెళ్ళాం కాన్పులో పోయిందనీ, అతను పెద్దవాడేమీ కాడనీ, అతని వయసు పార్వతికి తగ్గవయసేనని, పిల్లలు కూడా లేరనీ చెప్పాడు.

ఎప్పుడయితే పార్వతి మేనమామ రెండవ పెళ్ళని చెప్పాడో అప్పటినుండి వీరభద్రరావుగారు ఆ సంబంధం అంటే విముఖత చూపించారు. "పార్వతికి రెండవ పెళ్ళివాడేమిటి? వీల్లే" దని అన్నారు. కాని, సరస్వతమ్మగారు మాత్రం పరి అన్నయ్య పక్షమే చేరి మాట్లాడారు. ఆమెకు ఆ సంబంధం అన్నివిధాలా నచ్చింది. "ఇటువంటి సంబంధం మళ్ళీ తేలేము. ఈ అవకాశం వదులుకుంటే మన పార్వతికి అసలు పెళ్ళే కాదు" అని భర్తతో వాదించింది.

వారి వాదోపవాదాలు విని, తను వారికి ఇంకేమాత్రమూ భారం కావడం ఇష్టంలేక పార్వతి చివరికి రెండవ పెళ్ళివాడు అయినా అభ్యంతరం లేదని, తనకా సంబంధం ఇష్టమేనని వీరభద్రరావు గారితో చెప్పింది. వీరభద్రరావుగారు మరి మాట్లాడలేదు.

సోమశేఖరానికీ, పార్వతికీ పెళ్ళయి పోయింది.

* * * *

"అమ్మో!" బాధతో మెలితిరిగిపోతూ అరిచింది పార్వతి.
"ఏం ఫరవాలేదు. మేమున్నాముగా" అంది జానకమ్మ.
"వీల్లేదు ... వీల్లేదు ... నేను గొంతు పిసికి చంపే..."

పార్వతి ప్రాణం విలవిల లాడిపోతూంది. ఆమెలోని మరో ప్రాణి స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకోవడానికి ఆత్రపడుతూంది. ఆ ప్రాణి విజయం సాధించడంకోసం సర్వ ప్రయత్నాలూ చేస్తూంది. తనకు అడ్డువచ్చిన తెరలను చీల్చుకుంటూ ముందుకు, ఆత్రంగా తను అడుగిడబోయే కొత్త లోకాన్ని చూద్దామని వడివడిగా ముందుకు దూసుకువస్తూంది. తనకు విజయం చేకూరే చివరి ఘడియ అది... భూమిమీద కొత్త సృష్టి జరిగేవేళ అది... అదే ఇంక ఆఖరి క్షణం... పార్వతి కెవ్వున కేకవేసింది.

* * * *

పార్వతి వేసిన కేకకు గది బయట పచార్లు చేస్తున్న సోమశేఖరం కంగారు పడ్డాడు. వెంటనే బిడ్డ ఏడుపు వినపడ్డంతో అతని మనస్సు కుదుటపడింది. ఇందాకటినుంచీ అతని మనసు మనసులో లేదు.

'పార్వతి కెలా ఉందో?'

మళ్ళీ అనుమానం. అతని గుండె భారంగా కొట్టుకుంటుంది.

గది తలుపులు తెరుచుకున్నాయి.

"ఆడపిల్లండీ!" అంది బయటికి వచ్చిన మంత్రసాని.

"పార్వతి?"

"తల్లీ, బిడ్డా ఇద్దరూ కులాసాగానే ఉన్నారు. అమ్మాయిని చూసుకుందురుగాని రండి" అంది నవ్వుతూ.

సోమశేఖరం తేలికపడిన మనసుతో గదిలోకి ప్రవేశించాడు.

"రావయ్యా, అల్లుడూ, నీకూతుర్ని చూసుకో" అంది జానకమ్మ నవ్వుతూ.

పార్వతి సోమశేఖారాన్ని చూసి చిరునవ్వు నవ్వింది.

సోమశేఖరం పార్వతి మంచం దగ్గరికివచ్చి నిలుచుని తదేకంగా చూస్తున్నాడు.

పార్వతి కళ్లలో వెలిగే వెలుగును చూస్తున్నాడు.

ఆమె ముఖంలో తాండవించే తృప్తిని చూస్తున్నాడు.

ఆమె కళ్ళలో ప్రతిఫలించే బిడ్డను చూస్తున్నాడు.

బిడ్డమీద ఒక్కసారిగా తన ప్రేమ నంతటనీ ప్రవహింపచేయడానికి ఆ తల్లిపడే తపనను చూస్తున్నాడు.

సోమశేఖరం అలా రెప్పవాల్చకుండా పార్వతిని చూస్తూనే ఉన్నాడు.

"ఏమండీ ... మన అమ్మాయిని చూశారా? ఇది మన ఇంటి వెలుగండీ! నా బంగారుకొండ! ముద్దులపట్టి" అంటూ అమితంగా సంబరపడిపోతూ పార్వతి బిడ్డను తమకంతో గుండెలకు అదుముకుంది.

సోమశేఖరం బిడ్డవైపు తనదృష్టిని సారించాడు.

పాప అచ్చుగుద్దినట్లు అంతా పార్వతి పోలికే!

11-12-74, ఆంధ్రప్రభ